క్లుప్తంగా

నేడు నరసింహ జయంతి

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధి పోలకంపాడులోని శ్రీశ్రీశ్రీ వరాహ నరసింహస్వామి దేవాలయంలో ఆదివారం నరసింహ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు విశేష పూజలు, అభిషేకములు, అనంతరం లక్ష్మీ నరసింహ హోమాము, మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు స్వామివారి గ్రామోత్సవము నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కమిటీ సభ్యులు ప్రకటనలో కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



తాడేపల్లి రూరల్: పారిశుద్ధ్య కార్మికులకు వేతన చట్టం ప్రకారం కనీసం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుండిమెడలో పారిశుద్ధ్య కార్మికులను శనివారం ఆయన కలిసి మాట్లాడారు. ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. తాడేపల్లి మండలంలోని పలు గ్రామాలు మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం అయినప్పటికీ పారిశుద్ధ్య కార్మికులకు పనిభారం పెరిగిందని.. కానీ కనీస వేతనం చెల్లించడం లేదని ఆయన అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను అమలు చేయడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని.. రైతాంగ వ్యతిరేక నల్లచట్టాల అమలును ఆపాలని దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు ఉషారాణి, జయంతి, సుధాకర్, ఏపేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలకు ఆయన మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ.. కార్మికులు తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం 158 రోజులుగా పోరాటం చేస్తున్నారని.. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. కోర్టులు కార్మికులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా యాజమాన్యం కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఇమాంబి, సారమ్మ, విజయశ్రీ, శివకుమారి, పిచ్చయ్య, హగ్గయ్య , గురవయ్య మాణిక్యరావు, లక్ష్మి, రమణ, సూర్య ప్రకాశరావు, నాగేశ్వరరావు, దుర్గా భవానీ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు కిశోర వికాసం

తాడికొండ: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా తుళ్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఋతుస్రావం, పరిశుభ్రత వంటి పలు అంశాలపై బాలికలకు తెలియజేశారు. విద్య ద్వారానే ఎదుగుదల సాధ్యమని, ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదు కనుక కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్–4లో మాతృవందనం కార్యక్రమం నిర్వహించి తల్లులను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ వేణుగోపాలుని తిరునాళ్లు



తాడికొండ: తాడికొండలో కొలువైయున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం రెడ్ల సంఘం వారితో పొన్న వాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామి వారి పొన్న వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో భారీ ఊరేగింపు జరిపారు. యువత, మహిళలు పెద్ద సంఖ్యలో సేవలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అర్ధరాత్రి తలుపులు తట్టి..

బలవంతంగా తీసుకు వెళ్లి

- కంతేరు ఎంపీటీసీపై పోలీసులు దాష్టీకం
- తమ ఫిర్యాదును స్వీకరించలేదన్న బాధితులు



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, బాలవజ్రబాబు

నగరంపాలెం: సుమారు 40 మంది పోలీసులు అర్ధరాత్రి సమయంలో తలుపులు తట్టి తాడికొండ కంతేరు ఎంపీటీసీ కల్పనను బలవంతంగా తీసుకు వెళ్లారని కుటుంబ సభ్యులు వాపోయారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, తాడికొండ సమన్వయకర్త బాలవజ్రబాబు(డైమండ్ బాబు), న్యాయవాదులతో పాటు కల్పన కుమార్తె భావన, కుటుంబ సభ్యులు మేడిద రమణ, కర్రి పరిమళ, మరియమ్మ, చిన్న పిల్లలతో శనివారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిసి ఆ రోజు రాత్రి పోలీసులు వ్యవహరించిన తీరుని వివరించారు. అనంతరం బాధితురాలి కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడారు.

> వైఎస్సార్ సీపీ వారు ఉండేందుకు వీల్లేదని టీడీపీ నేత ఒకరు హుకుం చేశారని మరో బాధితురాలైన మహిళ కన్నీటి పర్యంతమైయ్యారు. తమను అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నించారని అన్నారు. ఆ నాయకుడు ఉన్నంత వరకు ఏదో ఒక గొడవ జరుగుతుందని.. అదేమంటే వైఎస్సార్ సీపీ వాళ్లను బతకనీయమని చెబుతున్నారంటూ వాపోయారు.

అక్రమ కేసులు బనాయించి..

అందరం గాఢ నిద్రలో ఉండగా ఒక్కసారిగా తలుపులను పెద్ద శబ్దం వచ్చేటట్లుగా బాదారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. తలుపులు తీయగా హఠాత్తుగా పోలీసులు లోనకు చొరబడి కల్పనను బలవంతంగా తీసుకు వెళ్లే ప్రయత్నాలు చేశారని అన్నారు. నిద్రకు సౌకర్యంగా ఉండే దుస్తులలో ఉన్నానని.. చీర ధరించి వస్తానని పోలీసులకు చెప్పిన వారు ఆలకించలేదని వాపోయారు. బలవంతంగా తీసుకువెళ్లి తమ వాహనంలో ఎక్కించారని అన్నారు. చిన్న పిల్లల మధ్య తలెత్తిన వివాదానికి పెద్ద రాద్ధాంతమే చేశారని.. తమపై అక్రమ కేసులు బనాయించారని ఆందోళన వ్యక్తం చేశారు. అవతలి వారిపై తాము ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదని కల్పన కుమార్తె భావన తెలిపారు. నా భర్త విజయ భాస్కర్‌ను కూడా బలవంతంగా తీసుకువెళ్లి అరెస్ట్ చేశారని కర్రి పరిమళ వాపోయారు. న్యూడిల్స్ పాయింట్‌లో భర్త పనిచేసేవారని.. ఇద్దరు చిన్నారులైన పాప మేఘత, హర్షలు రోధిస్తున్నారని ఆమె తెలిపారు. తమకు జీవనాధారం ఎలా అని రోదించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శివశంకరరావు

తాడేపల్లి రూరల్: కార్మిక చట్టాల అమలు, 4 లేబర్ కోడ్‌ల రద్దుపై ఈనెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర రావు కోరారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో సీపీఎం కార్యాలయం వద్ద కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో తాడేపల్లి మండల నాయకులు మునునూరు సుహాస్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కార్మికుల పొట్టకొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా దేశవ్యాప్తంగా రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 20న జరిగే సమ్మెలో కార్మికులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సి.ఐ.టి.యు తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, ఎ.ఐ.టి.యు.సి తాడేపల్లి ప్రాంత ఏరియా నాయకులు కంచర్ల కాశయ్య, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి రంగారావు, సి.ఐ.టి.యు నాయకులు నాగపోగు విజయరాజు, చొక్కా మరియదాసు, పుల్లగూర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి



మందడంలో పని విరామంలో నిరసన తెలియజేస్తున్న కార్మికులు

తాడికొండ: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి అన్నారు. రాజధాని ప్రాంతంలోని మందడంలో పని విరామంలో పారిశుద్ధ్య కార్మికులతో ఆయన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక వర్గాన్ని అనిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలన్నారు. కార్మిక వర్గం ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తే కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఈనెల 20న జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు పి.రత్నకుమారి, మార్తమ్మ, అరుణ, భూలక్ష్మీ, రమాదేవి, ఆనంద కుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మాతృదినోత్సవం



తమ చిన్నారులు వేసిన చిత్రాలను అందుకుంటున్న మాతృమూర్తులు

తాడేపల్లి రూరల్: అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రంలో మాతృదినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పెనుమాకలోని 6వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు వేడుకలను నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో టీచర్లు అమ్మ ఫొటోను గీయించి దానికి రంగులు వేయించి తమ తల్లులకు బహుమతిగా అందజేశారు. తమ పిల్లలు వేసిన పెయింటింగ్‌లు చూసి మాతృమూర్తులు ఎంతో ఆనందించారు. అనంతరం చిన్నారులకు అక్షింతలు వేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరళ, కిరణ్మయి, జశ్వంతి, మణి, మల్లేశ్వరి, వెంకటరత్నం, ఏఎన్ఎమ్ భువనేశ్వరి, మహిళా పోలీస్ మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీ వైబ్ సంస్థ ఆధ్వర్యంలో మాతృదినోత్సవం నేడు..

మంగళగిరి: మాతృదినోత్సవం సందర్భంగా వీ వైబ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్ఫూర్తిదాయక కార్యక్రమాలలో మహిళలంతా పాల్గొని విజయవంతం చేయాలని సంస్థ అధినేత రాగవీణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మాతృదినోత్సవ కార్యక్రమంలో నటి అనన్య నాగళ్ల పాల్గొంటారన్నారు. సాయంత్రం 6 గంటలకు ఎస్ఆర్ఐ జంక్షన్ నుంచి 3కే రన్ ప్రారంభమవుతుందని.. 7.30 గంటలకు చేనేత వస్త్రాలతో మహిళల ఫ్యాషన్ షో జరుగుతుందన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి కౌన్సెలింగ్


నేర నియంత్రణకు నూతన ప్రక్రియకు నాంది పలికిన ఎస్పీ



రౌడీషీటర్ ఖాసిం వలికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

తెనాలిరూరల్: నేర నింత్రణకు, శాంతి భద్రతల పరిరక్షణకు ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందుకు సరికొత్త విధానానికి నాంది పలికారు. సాధారణంగా రౌడీషీటర్లను ఆయా పోలీస్‌స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తుంటారు. కొన్ని సందర్భాల్లో గుంటూరులోని డార్మెటరీకి పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తారు. ఇందుకు భిన్నంగా పరికొత్త ప్రక్రియను ఎస్పీ తెనాలిలో చేపట్టారు. రౌడీషీటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి రౌడీషీటర్లతో పాటు వారి కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్ల కదలికలపై వివరాలు సేకరించేందుకు శనివారం తెనాలి వచ్చిన ఆయన పట్టణంలోని టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం రౌడీషీటర్లు, వారి కదలికలు, వారిపై ఉన్న కేసులు, వారు కౌన్సిలింగ్‌కు స్టేషన్‌కు హాజరవుతున్న వివరాలను డీఎస్పీ బి. జనార్ధనరావు ద్వారా తెలుసుకున్నారు. యడ్ల లింగయ్య కాలనీ, మారిస్‌పేట, పాండురంగ పేట, ఐతానగర్ తదితర ప్రాంతాలలో రౌడీ షీటర్ల ఇళ్లకు వెళ్లి, వారి కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు. కుటుంబ నేపథ్యాన్ని కూడా తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న రౌడీషీటర్లకు ఆయన నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రౌడీషీటర్ల ఆగడాలకు పూర్తిస్థాయిలో కళ్లెం వేసే దిశగా పనిచేస్తున్నామని, కచ్చితంగా మెరుగైన ఫలితాలు సాధిస్తామని చెప్పారు. జిల్లాలో రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా, వారికి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్, రౌడీ షీటర్లు కౌన్సిలింగ్కు హాజరవుతున్నారా లేదా అన్న విషయాలను తెలుసుకునేందుకు పర్యటించినట్లు చెప్పారు. రౌడీషీటర్ల ఆగడాలకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టే యోచనలో ఉన్నామన్నారు. గతంలో వారిపై ఉన్న కేసులను కూడా పరిశీలిస్తున్నామని, వాటిలో త్వరితగతిన శిక్షలు పడే విధంగా ప్రయత్నిస్తున్నామన్నారు. కేసులలో ఉన్నవారు తిరిగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్ విజయ్‌పై పీడీ యాక్ట్ ప్రయోగించామని, త్వరలో మరికొందరిపై కూడా యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. రూ.5 లక్షల పూచీ కత్తుతో బైండోవర్ జరుగుతుందని, నిబంధనలను ఉల్లంఘించిన వారు రూ. 5 లక్షలు జరిమానా చెల్లించాలని లేనిపక్షంలో జైలు శిక్ష తప్పదన్నారు. ఇటీవల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన రౌడీషీటర్ అన్నం రమేష్‌కు ఎగ్జిక్యూటివ్ మ్యాజిస్ట్రేట్ కేవీ గోపాలకృష్ణ రిమాండ్ విధించిన సంగతి గుర్తు చేశారు. రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట డీఎస్పీ బి. జనార్ధనరావు, సీఐలు వి. మల్లికార్జునరావు, రాములు నాయక్, ఎస్.రమేష్‌బాబు, ఎస్ఐలు ఉన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణరాయబార ఘట్టం



శ్రీకృష్ణరాయబారం నాటకంలో సన్నివేశం

తెనాలిటౌన్: శ్రీ దుర్గాభవానీ నాట్యమండలి తెనాలివారిచే ప్రదర్శించిన శ్రీకృష్ణరాయభారం పొన్నుసీను పౌరాణిక నాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. రూరల్ మండలం కొలెవరం గ్రామంలో నిర్వహిస్తున్న బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా ప్రదర్శిస్తున్న పౌరాణిక, సాంఘిక నాటకాలు ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి ప్రదర్శించిన శ్రీకృష్ణరాయభారం నాటకంలో కృష్ణుడిగా తాడిబోయిన నాగేశ్వరరావు, అర్జునుడిగా మున్నంగి శ్రీనివాసరావు, దుర్యోధనుడిగా కె.అశోక్‌కుమార్ నటించి ప్రేక్షకులను మెప్పించారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు రచించి నటించిన సింహామంటి చిన్నోడు సాంఘిక నాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సమకాలిన రాజకీయాలను అద్దంపట్టే సన్నివేశాలు నాటికలో ప్రదర్శించారు. ఈ నాటకంలో బెల్లంకొండ వెంకట్, తాడిబోయిన నాగేశ్వరరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, పి.అశోక్ గజపతిరాజు, విజయసారథి, హైమారావు, రామరాజు, శ్రీనివాసరావు, శంకరరావు, గోపిరాజు, మన్నవరాజు, కమలి, సంధ్య నటించారు. నాటక ప్రదర్శన అనంతరం నటీనటులను నిర్వాహకులు దుశాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

మంగళగిరి: నగర పరిధిలోని బేతపూడిలో శుక్రవారం జరిగిన హత్య కేసులో పరారైన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శుక్రవారం రాత్రి బేతపూడిలో అడవి శ్రీనివాసరావును ఆస్తి వివాదంలో తన కుమారుడు పరమేశ్వర రావు హత్య చేసి పరారయ్యాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. విజయవాడలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారిస్తున్నట్లు సమాచారం.

వేసవి ఉక్కపోతలో అంగన్‌వాడీ చిన్నారులు

- మండు వేసవిలోనూ కొనసాగుతున్న తరగతులు
- ఇరుకు గదులలో అల్లాడుతున్న పిల్లలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

మంగళగిరి: అసలే వేసవి. పెద్దలు సైతం ఉదయం 10 గంటలు దాటితే బయట తిరగలేని పరిస్థితి. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ఇచ్చిన ప్రభుత్వం చిన్నారుల అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించకుండా కాఠిన్యం ప్రదర్శిస్తోంది. ఉదయం 8 గంటలకే ఉక్కపోతలు ప్రారంభమవుతున్నాయి. దీంతో ఆరేళ్ల వయసులోపు చిన్నారులు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పైగా చాలా అంగన్‌వాడీ కేంద్రాలు చాలీ చాలని ఇరుకు గదులు, రేకుల ఇళ్లతో దర్శనమిస్తుంటాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులు ఉక్కపోతతో పడే ఇబ్బంది వర్ణనాతీతం.

టీచర్లకూ తప్పని ఇబ్బందులు..

మే నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు 15 రోజులు, సహాయకులకు 15 రోజులు సెలవులు ఇచ్చారు. అయినా వీరిలో ఎవరో ఒకరు కేంద్రాలు నడపాల్సిందే. ఇప్పటికే రకరకాల యాప్‌లతో అంగనవాడీ టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వేసవిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిన్నారులకు ఒంటిపూట బడి పెట్టాలని కార్యకర్తలు సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలలో ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో టీచర్లు, ఆయాలు, చిన్నారులు ఎండ వేడిమితో తల్లడిల్లిపోతున్నారు.

కేంద్రాల వివరాలు..

మంగళగిరి ఐసీడీఎస్ పరిధిలో మంగళగిరి, మంగళగిరి రూరల్, తాడేపల్లి, తాడేపల్లి రూరల్, దుగ్గిరాల మండలాల్లో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 238 ఉన్నాయి. వాటిలో మెయిన్ 235 కాగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 3 ఉన్నాయి. ఇందులో గర్భిణులు 1588 మంది, బాలింతలు 1596 మంది ఉన్నారు. కాగా మూడేళ్ల లోపు బాలురు 4781 మంది, బాలికలు 4565 మంది ఉండగా వీరికి పౌష్టికాహార సరకులు ఇంటికి పంపుతున్నారు. 3 నుంచి 6 ఏళ్ల లోపు 2165 బాలురు, 2091 మంది బాలికలు ఉండగా వీరు అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుకుని పౌష్టికాహారం స్వీకరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఫీడింగ్ సమస్య లేకుండా ఉండేందుకు కేంద్రాలు నడుపుతున్నాం. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు చిన్నారులను కేంద్రాలలో ఉంచుతున్నాం. టీచర్లు, ఆయాలకు 15 రోజుల చొప్పున సెలవులు ఇస్తున్నాం. వేసవిలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– విజయలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్

దేశ సేవకుడి మూడో వర్ధంతి

దుగ్గిరాల: భారత సైనికుడిగా, ప్రజా నాట్య మండలి నాటకాల్లో నిరంతరం ప్రజల కోసం పనిచేసిన కామ్రేడ్ గుడిసె నాగరాజు చిరస్మరణీయులని సీపీఎం మండల కార్మిక నాయకులు జెట్టి బాల రాజు అన్నారు. శనివారం తుమ్మపూడిలోని ఆయన స్తూపం వద్ద మూడో వర్ధంతిని నిర్వహించారు. సమావేశమైన ప్రజలను ఉద్దేశించి బాలరాజు మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐలో పని చేస్తూ దేశం కోసం సైనికుడిగా చేరి సేవలు అందించారన్నారు. ప్రజానాట్య మండలిలో నాటక రంగాలల్లో కీలకంగా పని చేశారని.. సీపీఎం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని నాగరాజు సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో బి.చిరంజీవి, జి.కార్తీక్, ఎం.నాగమల్లేశ్వర రావు, డి.బాల రాజు, కె.శ్రీనివాసరావు, బి.గోపయ్య తదిదరులు పాల్గొన్నారు.

శివాలయంలో వైభవంగా పూజలు

దుగ్గిరాల: స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీనాగేశ్వరస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. శనివారం ఆలయంలో ఉదయం 6.30 గంటలకు నిత్య హోమము, శ్రీ స్వామి వారికి అభిషేకము, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. రాత్రి 7.35 గంటలకు స్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువుగా జరిపారు. వాసిరెడ్డి సుధాకర్, పద్మ దంపతులు కల్యాణ క్రతువులో పాల్గొన్నారు. అర్చక స్వాములు, ఈవో శ్రీనివాసరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

దుగ్గిరాల: క్రీడలు యువతలో నైపుణ్యం పెంపునకు దోహదపడతాయని టీడీపీ నాయకులు అన్నారు. దుగ్గిరాలలో శనివారం డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌లో తారక రామా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, ఎంపీపీ షేక్.జబీన్, నాయకులు పాల్గొన్నారు.

16 కిలోల గంజాయి పట్టివేత

లక్ష్మీపురం: రైళ్ల ద్వారా వేరే రాష్ట్రాలకు గంజాయిని తరలించి అధిక లాభాలకు విక్రయిస్తున్న నిందితుడిని జీఆర్పీ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. అతడి నుంచి 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ పోలీసులు శనివారం తెలిపిన వివరాలు.. ఒడిశాకు చెందిన అజిత్‌కుమార్ జైన్, భోగానాయక్ అక్కడ గంజాయిని కొనుగోలు చేసి అధిక లాభాలకు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో విక్రయించేందుకు రైలులో బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న రైల్వే డీఎస్పీ పి.అక్కేశ్వరరావు ఆధ్వర్యంలో జీఆర్పీ సీఐ అంజిబాబు, ఐపీఎఫ్ సీఐ శంకరరావు, ఎస్ఐలు లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్పీఎఫ్ సిబ్బంది ఎం.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఎం.సోమశేఖర్, జి.వాసులు కలిసి గుంటూరు రైల్వేస్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై నిఘా పెట్టారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో అజిత్‌కుమార్ జైన్‌ను జీఆర్పీ సీఐ అంజిబాబు సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. అజిత్ కుమార్ జైన్‌తో పాటు భోగానాయక్ అనే వ్యక్తి ఉన్నాడని, అతడు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అజిత్‌కుమార్ జైన్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

900 గ్రాములు స్వాధీనం..

లక్ష్మీపురం: గంజాయి తీసుకుంటూ, విక్రయించే ఐదుగురిలో నలుగురిని అదుపులో తీసుకోగా ఒక వ్యక్తి పరారైన ఘటన అదుపులో తీసుకున్న నలుగురిని విచారిస్తున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు కృష్ణబాబు కాలనీ ప్రాంతంలో రాజేష్, అజయ్, దావిద్, అశోక్, వాసిమళ్ల వంశీకృష్ణలు కలిసి గంజాయి తీసుకోవడం, విక్రయించడం చేస్తున్నారు. నగరంపాలెం సిఐ నజీర్ బేగ్‌కు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో హుటా హుటిన కృష్ణబాబు కాలనీలో గంజాయి సేవిస్తున్న వారిని అదుపులో తీసుకున్నారు. ఐదు గురిలో వాసిమళ్ళ వంశీకృష్ణ అనే వ్యక్తి పరారైయ్యాడు. మిగిలిన నలుగురిని పోలీసులు స్టేషన్‌కు తరలించి వారి వద్ద ఉన్న 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న వంశీకృష్ణ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో పేకాట స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించి నగదు స్వాధీనం చేసుకుని, పేకాట ఆడే వారిపై కేసులు నమోదు చేసిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. అరండల్‌పేట, పట్టాభిపురం, నగరంపాలెం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పేకాటాడుతున్న స్థావరాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ వెల్లడించారు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అరండల్‌పేట 9వ లైన్‌లోని ఓ ఇంట్లో పేకాటాడుతున్న స్థావరంపై ఆకస్మిక దాడి చేశారు. 17 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.81,000 నగదు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అదే విధంగా పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బృందావన గార్డెన్స్ రోడ్‌లోని ఒక లాడ్జిలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు, దాడులు నిర్వహించి 10 మంది జూదరులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద ఉన్న రూ.90,000 వేల నగదు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వుల మేరకు గుంటూరు వెస్ట్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న మూడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించడం జరిగిందన్నారు.